



EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శుక్రవారం
24 మే 2024
పేజీలు: 02




## సూపర్ స్టార్ రజనీకాంత్‌కు గోల్డెన్ వీసా!

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి గోల్డెన్ వీసా అందుకున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటూ సూపర్ స్టార్ సంతోషం వ్యక్తం చేశారు. యూఏఈ గోల్డెన్ వీసా పొందడం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా యూఏఈ ప్రభుత్వానికి రజనీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. పెట్టుబడిదారులు, వ్యవస్థాపకులు, శాస్త్రవేత్తలు, నటులు, సాహిత్యం, కల్చర్, అసాధారణ ప్రతిభ కలిగిన గ్రాడ్యుయేటర్లు.. ఇలా వివిధ రంగాలకు చెందిన వారికి 10 ఏళ్ల కాలపరిమితితో యూఏఈ ఈ ప్రత్యేక వీసాలను అందిస్తోంది. ఈ వీసా పొందిన వారు ఎలాంటి ఆంక్షలు లేకుండా యూఏఈలో దీర్ఘకాలికంగా నివసించే వీలు ఉంటుంది. 2019 నుంచి ఈ గోల్డెన్ వీసాలు మంజూరు చేయడం మొదలైంది. ఈ వీసాలకు 10 సంవత్సరాల కాలపరిమితి ఉంటుంది. ఆ తర్వాత అవే రెన్యువల్ అవుతాయి. ఈ వీసాతో యూఏఈ పౌరులుగా ప్రభుత్వం కల్పించే అన్ని ప్రయోజనాలను పొందవచ్చు. అలాగే వంద శాతం ఓనర్‌షిప్‌తో ఆ దేశంలో వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు.





## ఆగస్టు 15లోపు కేబినెట్ విస్తరణ?

లోక్‌సభ ఎన్నికల తర్వాత కేబినెట్‌ను విస్తరించాలని సీఎం రేవంత్ యోచిస్తున్నారట. ఆగస్టు 15లోగా పూర్తి కేబినెట్ బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. రాజ్‌గోపాల్‌రెడ్డి, జి.వివేక్, ప్రేమ్‌సాగర్ రావు, దేవరకొండ MLA బాలు నాయక్, మక్తల్ MLA వి.శ్రీహరి కేబినెట్ బెర్త్ కోసం ముందు వరుసలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు త్వరలో BRS నుంచి కాంగ్రెస్‌లో చేరే ఒకరిద్దరికీ అవకాశమున్నట్లు సమాచారం.



## ఎవరెస్ట్ ఎక్కిన 16 ఏళ్ల భారత టీనేజర్

ముంబైకి చెందిన 16 ఏళ్ల కామ్యా కార్తికేయన్ అసాధారణ రికార్డు నెలకొల్పింది. ప్రపంచంలోకెల్లా అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం మౌంట్ ఎవరెస్ట్‌ను నేపాల్ వైపు నుంచి అధిరోహించిన తొలి భారత పిన్నవయస్కురాలిగా నిలిచింది. అలాగే ప్రపంచం మొత్తంమీద ఈ ఘనత సాధించిన రెండో అతిపిన్న వయస్కురాలిగా ఖ్యాతిగాంచింది. భారత నౌకాదళంలో పనిచేసే తన తండ్రి ఎస్.కార్తికేయన్‌తో కలసి కామ్యా ఈ నెల 20న 8849 మీటర్ల ఎత్తయిన ఎవరెస్ట్‌ను అధిరోహించింది.



## పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదు: స్వాతి మలివాల్

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్‌కుమార్ తనపై దాడి చేశాడని కేసు పెట్టిన రాజ్యసభ ఎంపీ స్వాతి మలీవాల్ తాజాగా మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రాజ్యసభ ఎంపీ పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. 'వాళ్లకు ఎంపీ సీటు కావాలంటే నన్ను అడిగి ఉండాల్సింది. కావాలంటే నా ప్రాణాలైనా ఇచ్చుండేదాన్ని. నేను ఏ రోజూ పదవుల కోసం ఆశపడలేదు' అని తెలిపారు.

## ఇంటర్నేషనల్ కిడ్నీ రాకెట్‌లో హైదరాబాద్ వైద్యుడు

కేరళలో బయటపడ్డ ఇంటర్నేషనల్ కిడ్నీ రాకెట్ సూత్రధారి హైదరాబాద్ వైద్యుడని ఆ రాష్ట్ర పోలీసులు గుర్తించారు. అతడి పేరును వెల్లడించలేదు. ఇప్పటి వరకు బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన 40 మంది పేద యువకులను ఇరాన్ తీసుకెళ్లి కిడ్నీలు విక్రయించినట్లు తెలిపారు. ₹20 లక్షలు ఇస్తామని చెప్పి ₹6 లక్షలే ముట్టజెబుతున్నారన్నారు. ముఠా సభ్యుల్లో ఒకరైన సబిత్‌ను అరెస్టు చేసి ప్రశ్నించడంతో వివరాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు.

### నేడు ఐపీఎల్ క్వాలిఫయర్- 2

# ఫైనల్‌కు వెళ్లేదెవరు?



ఐపీఎల్-17లో ఇదివరకే ఫైనల్ చేరిన కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)ను టైటిల్ పోరులో ఢీకొనబోయే జట్టేదో నేడు తేలనుంది. శుక్రవారం చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్).. రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్)తో అమీతుమీ తేల్చుకోనుంది.
క్వాలిఫయర్-1లో కేకేఆర్ చేతిలో అవమానకర ఓటమి ఎదుర్కొన్న ఎస్‌ఆర్‌హెచ్‌తో పాటు లీగ్ చివరిదశలో వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఓడినా బెంగళూరును 'ఎలిమినేట్' చేసిన రాజస్థాన్‌కూ టైటిల్ వేటలో 'క్వాలిఫయర్-2' అత్యంత కీలకం. బ్యాటింగ్ పవర్ హౌజ్‌గా ఉన్న హైదరాబాద్.. స్పిన్‌కు అనుకూలించే చెపాక్ పిచ్‌పై అత్యుత్తమ స్పిన్నర్లు కలిగిన రాయల్స్‌ను ఎదుర్కోనుండటంతో చెన్నైలో మరో రసవత్తర పోరు ఖాయం!
ఈ సీజన్‌లో హైదరాబాద్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (533 పరుగులు), అభిషేక్ శర్మ (413) భీకర ఫామ్‌లో ఉన్నప్పటికీ.. ఆసీస్ ఓపెనర్ గత రెండు మ్యాచ్‌లలో డకౌట్ అవడం హైదరాబాద్‌ను ఆందోళనకు గురిచేసేదే. కోల్‌కతాతో మ్యాచ్‌లో అతడు నిష్క్రమించగానే అభిషేక్ కూడా చేతులెత్తేయడం రైజర్స్‌ను దెబ్బతీసింది. ఈ ఇద్దరూ చెపాక్ పిచ్‌పై రాజస్థాన్ స్పిన్ ద్వయం అశ్విన్, చాహల్‌ను ఏ మేరకు ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. కొత్తబంతితో నిప్పులు చెరిగే బౌల్ట్‌తోనూ ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ఓపెనర్లు నిలదొక్కుకుంటేనే హైదరాబాద్‌కు మెరుగైన స్కోరు చేసే అవకాశముంటుంది. గత రెండు మ్యాచ్‌లలో రాణించిన రాహుల్ త్రిపాఠికి తోడు నితీశ్ రెడ్డి, క్లాసెన్ నిలబడితేనే భారీ స్కోరుకు బాటలు వేయొచ్చు. కమిన్స్ నేతృత్వంలోని బౌలింగ్ దళం ప్రదర్శన హైదరాబాద్‌ను భయపెడుతున్నా తక్కువ స్కోర్లు నమోదయ్యే చెన్నై పిచ్‌పై బౌలర్లు సత్తాచాటాలని ఎస్‌ఆర్‌హెచ్ ఆశిస్తోంది. ఐపీఎల్-17 ఆరంభంలో నిలకడగా విజయాలు సాధించి తర్వాత తడబడ్డా ఎలిమినేటర్‌లో సమిష్టిగా రాణించిన రాయల్స్.. మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శననే నమ్ముకుంది. నాకౌట్ దశలో జైస్వాల్ ఫామ్‌ను అందుకోవడం ఆ జట్టు బ్యాటింగ్ బలాన్ని మరింత పెంచేదే. శాంసన్ టచ్‌లోనే ఉండగా మిడిలార్డర్‌లో రియాన్ పరాగ్, షిమ్రన్ హెట్‌మెయర్, రోవ్‌మన్ పావెల్, ధ్రువ్ జురెల్ వంటి హిట్టర్లతో ఆ జట్టు దుర్భేద్యంగా ఉంది. అంతగా పటిష్టంగా లేని హైదరాబాద్ బౌలింగ్ దళం వీరి దూకుడుకు అడ్డుకట్ట వేయకుంటే ఎస్‌ఆర్‌హెచ్‌కు తిప్పలు తప్పవు. చెన్నై పిచ్ గురించి అణువణువూ తెలిసిన అశ్విన్‌తో పాటు లెగ్ స్పిన్నర్ చాహల్ రాజస్థాన్ బౌలింగ్‌కు కీలకం కానున్నారు.
తుది జట్లు (అంచనా):
హైదరాబాద్: హెడ్, అభిషేక్, రాహుల్, నితీశ్, క్లాసెన్, సమద్, షాబాజ్, కమిన్స్, భువనేశ్వర్, వియస్కాంత్, నటరాజన్
రాజస్థాన్: జైస్వాల్, కోహ్లర్, శాంసన్, పరాగ్, జురెల్, హెట్‌మెయర్, పావెల్, అశ్విన్, బౌల్ట్, అవేశ్, చాహల్

## పుష్ప 2లో త్రిప్తి దిమ్రీ ఐటెమ్ సాంగ్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'పుష్ప 2'లో బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రీ నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో త్రిప్తి ఐటెమ్ సాంగ్ చేయనున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సాంగ్‌ను తెరకెక్కించనున్నట్లు టాక్. సుకుమార్ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఫహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ, ధనంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు.





హైదరాబాద్ శ్రీశైలం రహదారిపై రోడ్డు ప్రమాదం..

## ముగ్గురు మృతి

హైదరాబాద్- శ్రీశైలం రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో ఏకంగా ముగ్గురు మృతి చెందారు. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైద్రాబాద్ _శ్రీశైలం రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం శుక్రవారం ఉదయం జామున జరిగింది. ఓ కారు ను బస్సు వేగంగా వెళ్లి ఢీ కొట్టింది. అయితే.. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు మృతి చెందినట్లు సమాచారం. ఇటు బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయలు అయినట్లు సమాచారం. ఆమనగల్ మండలం అయ్య సాగర్ వద్ద ఈ ఘటన జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్- శ్రీశైలం రహదారిపై రోడ్డు ప్రమాదంపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.



## జూన్ 1న గ్రూప్1 హాల్ టికెట్లు

జూన్ 9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష హాల్ టికెట్లు జూన్ 1 నుంచి అందుబాటులో ఉంటాయని TGPSC వెల్లడించింది. ఈసారి భారీగా(4.03లక్షలు) దరఖాస్తులు రావడంతో OMR పద్ధతిలో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ఉ.10:30 నుంచి మ.ఒంటి గంట వరకు పరీక్ష జరగనుండగా, అభ్యర్థులకు బయోమెట్రిక్ తప్పనిసరి అని అధికారులు తెలిపారు. బయోమెట్రిక్‌లో సమస్య ఉంటే అభ్యర్థి ఫొటో, ఇంక్ ప్యాడ్ ద్వారా వేలిముద్ర తీసుకుంటారు.

## ఓటుకు రూ.5,000.. ముగ్గురు టీచర్ల సస్పెండ్

ప్రకాశం జిల్లా దర్శిలో ఓటు వేసేందుకు ఓ పార్టీ నుంచి పోస్టల్ బ్యాలెట్‌కు రూ.5,000 తీసుకున్న కేసులో ముగ్గురు టీచర్లను కలెక్టర్ దినేశ్ కుమార్ సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయిన వారిలో గుత్తా నారాయణ, గోవిందు, అరుణకుమారి ఉన్నారు. కాగా ఇటీవల ఇదే తరహాలో పోస్టల్ బ్యాలెట్‌కు రూ.5,000 తీసుకున్నట్లు తేలడంతో మంగళగిరి ఎస్సై ఖాజాబాబును ఐజీ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## దారుణం.. ఇజ్రాయెల్ మహిళా సైనికులపై చిత్రహింసలు

ఇజ్రాయెల్ మహిళా సైనికులను చిత్రహింసలు పెడుతున్న వీడియోను హమాస్ ఉగ్రవాదులు తాజాగా విడుదల చేశారు. అందులో వారి ముఖంపై తీవ్ర గాయాలు కనిపించాయి. కొందరు నడవలేని స్థితిలో ఉండగా వారి కాళ్లను కట్టేసి జీపులో ఎక్కిస్తున్న దృశ్యాలు భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. గతేడాది అక్టోబర్‌లో ఇజ్రాయెల్‌పై దాడి చేసిన మిలిటెంట్లు.. 250 మందిని బందీలుగా ఎత్తుకెళ్లారు. అందులో హమాస్ చెరలో ఐదుగురు మహిళా సైనికులున్నారు.



## అన్నతో తేల్చుకోవాలని షర్మిలకు చెప్పా: వీహెచ్

తెలంగాణలో పార్టీ పెట్టిన షర్మిలకు ఏపీ వెళ్లి అన్నతో తేల్చుకోవాలని గతంలోనే చెప్పానని కాంగ్రెస్ సీనియర్ నేత VH హనుమంతరావు తెలిపారు. రాజమండ్రిలో మాట్లాడుతూ.. ఆమె మూడేళ్ల కిందటే ఏపీకి వచ్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. వచ్చే ఐదేళ్లలో ఇక్కడ కూడా కాంగ్రెస్ బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో నెలకొల్పే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని రాజమండ్రిలో తయారు చేయిస్తున్నామన్నారు.



## మేడిగడ్డ వద్ద మళ్లీ భారీ శబ్దాలు!

కాళేశ్వరం బ్యారేజీలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద మళ్లీ భారీ శబ్దాలు, ప్రకంపనలు వచ్చాయి. ఏడో బ్లాకులోని 16వ గేటును పైకి ఎత్తేందుకు ప్రయత్నించగా భూగర్భంలో ధ్వనులు వినిపించాయి. దీంతో బ్యారేజీ పెను ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉండటంతో పనులు నిలిపేశారు. గతంలో వరదల సమయంలో పునాదుల కింద ఇసుక కొట్టుకుపోవడంతో భారీ గొయ్యి ఏర్పడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. దానిని పూడ్చివేశాకే గేట్లు తెరిచే అవకాశం ఉంది.




## వచ్చే నెలలో సునీతా విలియమ్స్ రోదసి యాత్ర

భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ మూడో రోదసి యాత్ర వచ్చే నెలలో జరగనుంది. బోయింగ్ సంస్థకు చెందిన స్టార్ లైనర్ వ్యోమనౌకలో బుచ్ విల్‌మోర్ అనే మరో వ్యోమగామితో కలిసి ఆమె జూన్ 1 నుంచి 6 మధ్య ఈ యాత్ర చేపట్టే అవకాశమున్నట్లు నాసా తెలిపింది. స్టార్ లైనర్‌తో మానవసహిత యాత్ర నిర్వహించడం ఇదే తొలిసారి. మే 6నే ఈ ప్రయోగం జరగాల్సి ఉండగా చివరి క్షణంలో వాయిదా పడింది.

# మాజీ మంత్రి మల్లారెడ్డికి మరో షాక్..

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డికి మరో షాక్ తగిలింది. షామీర్ పేట్ మండలంలోని బొమ్రాసిపేట్ పెద్ద చెరువు ఎఫ్టీఎల్‌లో నిర్మించిన ప్రహరీ గోడను అధికారులు కూల్చివేశారు. చెరువు ఎఫ్టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు చేశారంటూ మల్లారెడ్డిపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో జేసీబీల సాయంతో చెరువులో నిర్మించిన ప్రహరీ గోడలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అలాగే పెద్ద చెరువును ఆక్రమించి నిర్మించిన మరికొన్ని నిర్మాణాలను కూల్చివేశారు. కాగా నగర శివార్లలోని కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల గ్రామంలోని సుచిత్ర పరిధిలో సర్వేనంబరు 82, 83లలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఇతరుల మధ్య నెలకొన్న భూ వివాదం తెలిసిందే. అయితే రెండున్నర ఎకరాల భూమి తనదేనంటూ మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డి వాదిస్తున్నారు. అందులో 1.11 ఎకరాల భూమి తమదని మరో 15 మంది చెబుతున్నారు. కాగా నాలుగు రోజుల క్రితం సర్వే నెం.82లోని స్థలంలో మల్లారెడ్డి, ఆయన అల్లుడుకు.. మరో 15మంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

**కోర్టు ఆర్డర్ ఉండటంతో...**

ఒక్కొక్కరం 400 గజాల చొప్పున గతంలో భూమిని కొనుగోలు చేశామని, కోర్టు సైతం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని 15మంది పేర్కొంటున్నారు. అయితే ఆ స్థలంపై కోర్టు ఆర్డర్ ఉన్నందున స్థలంలో ఎలాంటి గొడవలు చేయొద్దని ఇరువర్గాలకు పోలీసులు సర్దిచెప్పారు. అయితే మల్లారెడ్డి అనుచరులు తమను భయపెడుతున్నారని పోలీసులకు



15మంది సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ భూముల వివాదం ఇంకా కొనసాగుతోంది. ఈ విషయంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం మల్లారెడ్డి బాధితులు సమావేశం నిర్వహించారు. మరోసారి మల్లారెడ్డిపై బాధితులు సంచలన ఆరోపణలు చేశారు.

**మా 33 గుంటలు.. మల్లారెడ్డి భూమిలో ..**

"పూలు, పాలు అమ్ముడే కాదు... మల్లారెడ్డి భూ కబ్జాలు కూడా చేస్తున్నాడు. పేట్ బషీరాబాద్‌లోని 82 సర్వే నంబర్‌లో ఎకరం 29 గుంటల కన్నా.. ఎక్కువ ఉంటే మీకు సారీ చెప్పి రాజకీయాల నుంచి వెళ్లిపోతానని మల్లారెడ్డి చెప్పాడని... కానీ మమ్మల్ని భయబ్రాంతులకు గురిచేస్తున్నాడు. రెవెన్యూశాఖ అధికారులు ఆదివారం చేసిన సర్వేలో 82 సర్వే నంబర్‌లో మల్లారెడ్డికి చెందిన ఎకరం 29 గుంటలతో పాటు.. మాకు చెందిన 33 గుంటలు అందులో కలిసిపోయింది. మల్లారెడ్డికి చెందిన ఎకరం 29 గుంటలు వదిలేసి.. మా 33 గుంటలను మాకు పొజిషన్ ఇప్పించాలి. మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి ముందే ఈ సర్వే జరిగింది. మల్లారెడ్డి మాట మీద నిలబడాలి" అని బాధితులు పేర్కొన్నారు.

**చంపేస్తామని బెదిరిస్తున్నారు..**

"2016లో మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత మా పార్టీషన్ తీసేసి మాపైన కేసు పెట్టించాడు. అప్పుడు పోలీసులను ఆశ్రయిస్తే కోర్టుకు వెళ్లమన్నారు. కోర్టు నుంచి "నాట్ టు ఇంటర్ ఫియర్" అనే ఆర్డర్ తీసుకొచ్చాం. కోర్ట్ ఆర్డర్ ఉన్నా... అప్పట్లో మాకు న్యాయం జరగలేదు.రీసెంట్‌గా మా డాక్యుమెంట్లు, కోర్టు ఆర్డర్ తీసుకొని పోలీస్ స్టేషన్‌కి వెళ్లాం. మాకు సరైన డాక్యుమెంట్లు ఉన్నాయి కాబట్టి మా ల్యాండ్‌లోకి మమ్మల్ని వెళ్లమని పోలీసులు చెప్పారు. దీంతో మా భూమిలోకి వెళ్లి మేము బ్లూ షీట్స్ వేసుకున్నాం. దీంతో మల్లారెడ్డి వచ్చి మాపై దాడులు చేసి పోలీసుల ముందే మేము వేసిన బ్లూ షీట్స్ తొలగించారు. పోలీసుల ముందే మమ్మల్ని చంపేస్తామని మల్లారెడ్డి బెదిరించారు" అని ఆయన బాధితులు సంచలన ఆరోపణలు చేశారు.




## 20 శాతం మంది ఉద్యోగులు ఔట్!

ఆర్బీఐ నిషేధంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పేటీఎం ప్రస్తుతం ఖర్చు తగ్గించుకునే పనిలో పడింది. ఇందుకోసం ఉద్యోగులపై వేటు వేయాలని భావిస్తోంది. మొత్తం వర్క్ ఫోర్స్‌లో 15 - 20 శాతం ఉద్యోగులను ఇళ్లకు పంపాలని అనుకుంటోందట. 2024 ఆర్థిక సంవత్సరంలోనే ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని చూస్తోంది. 2023 ఆర్థిక సంవత్సరంలో పేటీఎంలో 32 వేల 798 మంది ఉద్యోగులు ఉండేవారు. అందులో 29 వేల 503 మంది యాక్టివ్ వర్క్ ఫోర్స్‌గా ఉన్నారు. ఆ సమయంలో ఒక్కో ఉద్యోగి మీద పేటీఎం సరాసరిన 7 లక్షల 87 వేల రూపాయలు ఖర్చు చేసింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల కోసం పెట్టాల్సిన ఖర్చు 34 శాతం పెరగాలి. అంటే ఒక్కో ఉద్యోగి మీద పేటీఎం 10 లక్షల 60 వేలు కంపెనీ ఖర్చు చేయాలన్నమాట. తద్వారా ఏటా కంపెనీకి రూ.3 వేల 124 కోట్లు ఖర్చు అవుతుంది.

**రూ.500 కోట్ల ఆదా కోసం..**

నష్టాలను తగ్గించడానికి ఉద్యోగులపై వేటు వేయడమే మార్గమని పేటీఎం భావిస్తోంది. ఉద్యోగులను తొలగించడం ద్వారా రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు ఆదాయం సేవ్ చేయాలని కంపెనీ ప్రణాళికలు రచించింది. కంపెనీలో 15 - 30 శాతం వర్క్ ఫోర్స్ అంటే దాదాపు 5 వేల నుంచి 6 వేల 300 మంది ఉద్యోగులపై వేటు పడబోతోందనమాట. గతేడాది డిసెంబర్‌లోనే ఉద్యోగుల తొలగింపుపై పేటీఎం హింట్ ఇచ్చింది. ఆ సమయంలో వెయ్యి మందిని వేరే విభాగాలకు పంపించింది. FY24కి సంబంధించి ఉద్యోగుల సంఖ్య కచ్చితంగా తెలియనప్పటికీ Paytm వారికి అయ్యే వ్యయ నిర్మాణాన్ని హేతుబద్ధీకరించాలని నిర్ణయించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(AI) సాంకేతికతతో కంపెనీని ముందుకు నడిపి.. గణనీయంగా లాభాలు పొందాలని చూస్తోంది. ఆర్బీఐ నిషేధం తరువాత పేటీఎం రూ2 వేల 267 కోట్లు(3 శాతం) నష్టపోయింది.




## వస్తోంది.. సత్యభామ

కాజల్ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన 'సత్యభామ' జూన్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదట ఈ నెలలోనే విడుదల ఖరారు చేసుకున్న ఈ సినిమా కొన్ని కారణాల వల్ల జూన్ 7కి వాయిదా పడింది. కాజల్ అగర్వాల్ పోలీసు అధికారిగా నటించిన చిత్రమిది. సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తున్నారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మాతలు. దర్శకుడు శశికిరణ్ తిక్క స్క్రీన్‌ప్లే సమకూర్చడంతోపాటు, సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందిన చిత్రమిది. మహిళా ప్రేక్షకులు తప్పకుండా చూడాల్సిన సినిమా ఇదంటూ కాజల్ ప్రచార కార్యక్రమాల్లో చెబుతున్నారు. ఈరోజు ఈ సినిమా ట్రైలర్‌ని ప్రముఖ కథానాయకుడు బాలకృష్ణ విడుదల చేయనున్నారు. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, ఛాయాగ్రహణం: బి.విష్ణు.

## బీజాపూర్‌లో నక్సలైట్లపై దాడి.. 24 గంటల్లో 8 మంది మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్-బీజాపూర్, దంతేవాడ సరిహద్దు ప్రాంతాల్లో నక్సలైట్లు, భద్రతా సిబ్బంది మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇప్పటివరకు ఎనిమిది నక్సలైట్లు మరణించారు. నిన్న అంటే గురువారం నుంచి ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. నక్సలైట్ల నుంచి ఎనిమిది ఆయుధాలు, భారీ మొత్తంలో మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు. సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 100 మందికి పైగా నక్సలైట్లు హతమయ్యారు. ఎన్‌కౌంటర్‌లో ఈ ఎనిమిది మంది నక్సలైట్లు హతమైన తర్వాత, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి భద్రతా దళాలను ప్రశంసించారు. నక్సలిజంపై



ప్రభుత్వం గట్టిగా పోరాడుతుందన్నారు. భద్రతా దళాలు గొప్ప విజయాన్ని సాధించాయి. ఆయన ధైర్యానికి నమస్కరిస్తున్నాను. నక్సలిజానికి వ్యతిరేకంగా మా ప్రభుత్వం బలంగా పోరాడుతోంది. రాష్ట్రం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించడమే మా లక్ష్యం అన్నారు. ఇప్పటి వరకు 110 మందికి పైగా నక్సలైట్లు హతం

ఈ ఘటనతో రాష్ట్రంలో ఈ ఏడాది భద్రతా దళాలతో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 110 మందికి పైగా నక్సలైట్లు హతమయ్యారు. అంతకుముందు మే 10న బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సలైట్లు మరణించారు. ఏప్రిల్ 30న, నారాయణపూర్, కాంకేర్ జిల్లాల సరిహద్దులో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మహిళలతో సహా 10 మంది నక్సలైట్లు మరణించారు. ఇది కాకుండా ఏప్రిల్ 16న కంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు 29 మంది నక్సలైట్లను హతమార్చాయి.

## మహారాష్ట్రలోని ఫ్యాక్టరీలో బాయిలర్ పేలి..

### 10మంది మృతి.. 60మందికి గాయాలు

మహారాష్ట్రలోని డోంబివాలిలోని ఓ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలిన ఘటనలో ఇప్పటివరకు 10 మంది చనిపోయారు. ఈ ప్రమాదంలో మరో 60 మందికి పైగా గాయపడ్డారు.ఎంఐడీసీ ప్రాంతంలోని ఓ ఫ్యాక్టరీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీ యాజమాన్యంపై పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. అముదాన్ కెమికల్ ఫ్యాక్టరీలో గురువారం మధ్యాహ్నం 1.40 గంటలకు



బాయిలర్ పేలడంతో పేలుడు సంభవించింది. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు 10 మృతదేహాలను వెలికితీశారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించారు. క్షతగాత్రుల చికిత్స ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు.